## క్లుప్తంగా

### ఆంజనేయస్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అంజన్న

బొమ్మనహాళ్: ప్రసిద్ధ నేమకల్లు అంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు అనీల్ కుమార్‌స్వామి, సంతోష్‌కుమార్ స్వామి ఆధ్వర్యంలో పురోహితులు స్వామివారి మూలవిరాట్‌ను పట్టువస్త్రాలతో, పుష్పాలతో అలంకరించారు. కుంకుమార్చన, పంచామృతాభిషేకం, ఆకుపూజ, విశేష వెండి తమలపాకు అలంకరణ, అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి అన్నదానం చేసింది.

### మండల మైనార్టీల ఖాజీగా యూసుఫ్ వలి

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్ మండల ముస్లిం మైనార్టీ ఖాజీగా కల్లుహోళ గ్రామానికి చెందిన యూసుఫ్ వలిని నియమిస్తూ మైనార్టీస్ వెల్ఫేర్ శాఖ, జిల్లా కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయని మైనార్టీ నాయకులు తెలిపారు. ముస్లిం కమ్యూనిటీకి మాత్రమే వివాహాలు చేయడానికి ఖాజీగా ఉంటారని తెలిపారు.

### బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గౌని వెంకటరెడ్డి



రాయదుర్గంటౌన్: రాయదుర్గం బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా గౌని వెంకటరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం బార్ అసోసియేషన్ ఎన్నికలు ఎన్నికల అధికారి, సీనియర్ న్యాయవాది ఎన్‌సీ శ్రీనివాసన్ ఆధ్వర్యంలో జరిగాయి. అధ్యక్ష పదవికి గౌని వెంకటరెడ్డి ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఈసీ వన్నూరుస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా జాన్సన్, సంయుక్త కార్యదర్శి, కోశాధికారిగా పృథ్వీరాజ్, గౌరవాధ్యక్షుడిగా ఎన్‌సీ శ్రీనివాసన్ నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా రాజారావు, హనుమంతరెడ్డి, లోకానంద వహాబ్, హరికృష్ణారావు, నరసింహారావు, శ్యామలమ్మ, రవిచంద్ర, రేణుక, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఆర్‌టీ జగన్‌మోహన్‌రెడ్డిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

### కోడ్ పక్కాగా అమలు కావాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ రామాంజినమ్మ

బొమ్మనహాళ్: ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని తహసీల్దార్ రామాంజినమ్మ, ఎంపీడీఓ విజయమ్మ ఆదేశించారు. శనివారం వారు ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉద్యోగులు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ప్రకటనలు ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లను తొలగించాలన్నారు.

### ఆర్థికసాయం అందజేత


మారెన్న కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: రాంపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ మారెన్న కుటుంబానికి వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. వివరాలు.. ఇటీవల మారెన్న తండ్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తలారి రంగయ్య సూచన మేరకు పార్టీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. ములకనూరు తిమ్మరాయుడు, సర్పంచు చెన్నయ్య, స్థానిక నాయకులు గూల్యం రామాంజి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

### పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

రాయదుర్గంటౌన్: టెన్త్ పరీక్షలు రాసి పాలిసెట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 25 వరకు 25 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణతోపాటు స్టడీ మెటీరియల్ ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 8500419914ను సంప్రదించాలని ఆయన కోరారు.

# ఫ్యాన్ గుర్తుకు ఓటు.. సంక్షేమానికి చోటు

- వచ్చే ఎన్నికల తర్వాత టీడీపీ భూస్థాపితం
- జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు
- రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి


రాయదుర్గం గౌడలేఔట్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు అధికారం పగటికలగా మిగిలిపోతుందని, మరో 30 ఏళ్లు రాష్ట్రానికి సీఎంగా వైఎస్ జగన్ మాత్రమే ఉండాలన్నదే ప్రజలందరి అభిమతమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలోని గౌడలేఔట్, శాంతినగర్‌లో కౌన్సిలర్ భీమపల్లి నాగవేణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, పట్టణ కన్వీనర్ అరవ శివప్ప, నాయకుడు పొరాళ్ల శివలతో కలసి శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మెట్టుగోవిందరెడ్డి ఆయా కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కాలనీలో సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జూన్‌లో రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన తక్షణం ప్రతి సమస్యకూ పరిష్కారం చూపిస్తానన్నారు. జగనన్న పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేలా కృషి చేశారన్నారు. డీబీటీ–నాన్ డీబీటీ ద్వారా రూ.4.65 లక్షల కోట్లు పేదల చెంతకే చేర్చారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు 2014 ఎన్నికల్లోనూ జనసేన–బీజేపీ కూటమితో జతకట్టి గెలుపుకోసం 650 తప్పుడు హామీలిచ్చి ప్రజలను మోసం చేశాడని ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి విమర్శించారు. మళ్లీ అదే కూటమితో ఈ ఎన్నికల్లో మీ ముందుకు వస్తున్నాడని, ఈ సారి ఇంటికో కారు, ప్రతి మహిళకు బంగారు వడ్డాణం ఇస్తామన్నా ఆశ్చర్యం లేదన్నారు. టీడీపీ నాయకులు వస్తే నిలదీయాలన్నారు. డ్వాక్రా రుణమాఫీ, ఉంటికో ఉద్యోగం, ప్రతి ఇంటికీ రూ.2 కే 20 లీటర్ల శుద్ధి జలం, రైతు రుణమాఫీ తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించాలన్నారు. టీడీపీ హయాంలో కాలవ శ్రీనివాసులు గృహనిర్మాణశాఖ మంత్రిగా ఉన్నా రాయదుర్గంకు ఒరిగిందేమీ లేదన్నారు. పట్టణం చుట్టూ అభివృద్ధి చెందిన కాలనీలు వైఎస్సార్ హయాంలో నిర్మాణాలు జరిగితే, ప్రస్తుతం జగనన్న పాలనలో ఊళ్లను తలపించేలా ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయని మెట్టు గోవిందరెడ్డి అన్నారు. పేదోడికి ఖరీదైన ఆస్తిని ఇచ్చిన ఘనత వైఎస్సార్ కుటుంబానికే దక్కిందన్నారు. స్వార్థపరుల మాటలు నమ్మి పొరపాటు పడొద్దని హెచ్చరించారు. రాయదుర్గంలో ఇబ్బందుల్లేకుండా నీరు తాగుతున్నామంటే వైఎస్సార్ పుణ్యమేనని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా శంకరనారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

**వీఆర్‌ఓపై ఫిర్యాదు**

కాగా స్థానిక వీఆర్వో వ్యవహార తీరుపై మెట్టుగోవిందరెడ్డికి కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కాలనీలో కొన్ని ప్లాట్లు అవకతవకలు జరిగాయంటూ, దురాక్రమణదారుల చేతుల్లోకి వెళ్లకుండా అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తిచేశారు. దీంతో మెట్టు గోవిందరెడ్డి వెంటనే జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత, జౌళి విభాగం జిల్లా అధ్యక్షుడు నాగప్ప, కౌన్సిలర్లు శారదమ్మ, పొరాళ్ల గోవిందరాజులు, కొంతెం దేవరాజు, పైతోట సంజీవ, బండి అజయ్, ఐనాపురం మంజు, కో–ఆప్షన్ సభ్యుడు కడ్డిపుడి నజీర్, వార్డు ఇన్‌చార్జులు దివాకర్, గోరంట్ల సత్తి, గోల్డ్ ఇస్మాయిల్, బషీర్, చందన రామాంజినేయులు, నజీర్, రాము, వైక్ రవి, రఘురాం, పైతోట రఘు పాల్గొన్నారు.

### నేడు ‘విశ్వ’ ఎన్నికల ప్రచారం

ఉరవకొండ: పట్టణంలోని ఇంద్రానగర్‌లోని 9వ రోడ్డు నుంచి ఉరవకొండ అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి శనివారం తెలిపారు. ఉదయం 6గంటలకు ప్రచారం ప్రారంభం అవుతుందని తెలిపారు.

**నేడు వెలిగొండలో ప్రణయ్‌రెడ్డి ప్రచారం**

ఉరవకొండ: వెలిగొండలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాయలసీమ జోనల్ చైర్మన్ ప్రణయ్‌రెడ్డి ఆదివారం విజయసంకల్పయాత్ర ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు వెలిగొండ నరసింహులు తెలిపారు. మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

### జగనన్నతోనే ఎస్సీల సంక్షేమం

బ్రహ్మసముద్రం : రాష్ట్రంలో ఎస్సీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేందుకు సీఎం జగనన్న అనేక పథకాలు అమలు చేశారని ఎమ్మెస్ హనుమంతరాయుడు అన్నారు. మండలంలోని చెలిమేపల్లి, వేపులపర్తి, గుండిగానిపల్లి, పోలేపల్లి, పొబ్బర్లపల్లి, ఎరడికెర గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఎస్సీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ఎస్సీల సంక్షేమానికి జగనన్న చేసిన మేలును వివరించారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య, ఎంపీ అభ్యర్థి శంకరనారాయణను గెలిపించాలని కోరారు. దేవపుత్ర, కౌన్సిలర్ అర్చన, వేపులపర్తి మంజునాథ, లింగమయ్య, రంగస్వామి, టైలర్ శివ, ప్రసాద్, రమేష్, అంజినప్ప, రాజు పాల్గొన్నారు.

### చీర కొంగు చక్రంలో ఇరుక్కుని మహిళకు గాయాలు

కళ్యాణదుర్గం: చీర కొంగు బైక్ చక్రంలో ఇరుక్కుని మహిళకు గాయాలైన ఘటన కళ్యాణదుర్గం మండల పరిధిలోని విట్లంపల్లిలో శనివారం చోటు చేసుకుంది. విట్లంపల్లి గ్రామానికి చెందిన కమ్మ సంజమ్మ అదే గ్రామానికి చెందిన మధు అనే వ్యక్తి బైకులో పొలం నుంచి ఇంటికి బయల్దేరింది. ఈ క్రమంలో ఆమె చీర కొంగు వెనుక చక్రంలోకి ఇరుక్కుని ఒక్కసారిగా కింద పడింది. బలమైన గాయాలు కావడంతో కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సొంతగూటికి వైఎస్సార్‌సీపీ నాయకులు


గిడ్డి కామయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గంటౌన్: టీడీపీ నాయకులు బలవంతంగా కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్న వైఎస్సార్‌సీపీకి చెందిన గిడ్డి కామయ్య, అతని సోదరులు తిరిగి సొంతగూటికి చేరారు. శనివారం 20వ వార్డు మొళకాల్మూరు రోడ్డు చెక్‌పోస్టు సమీపంలో జరిగిన కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి గిడ్డి కామయ్య, సోదరులకు కండువాలతో వైఎస్సార్‌సీపీలోకి సాదర స్వాగతం పలికారు. పేదలకు మంచి చేస్తున్న జగన్ వెంటే తాము ఉంటామని గిడ్డి కామయ్య పేర్కొన్నారు. మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి మంచి జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలిబాషా, కౌన్సిలర్లు శ్రీనివాసరెడ్డి, బండి అజయ్, షబ్బీర్, మంజునాథ, నాయకులు కాంతారెడ్డి, వంశీ, చంద్ర, రఫీక్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే అభ్యర్థి రంగయ్య సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీలోకి చేరుతున్న 18వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి దంపతులు

**ఇక ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే**

కళ్యాణదుర్గం: రెండు రోజుల క్రితం టీడీపీలోకి చేరిన కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని వైఎస్సార్‌సీపీ 18వ వార్డు కౌన్సిలర్ మహాలక్ష్మి దంపతులు తిరిగి సొంత గూటికి చేరారు. శనివారం అనంతపురంలో కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి రంగయ్య సమక్షంలో తిరిగి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. టీడీపీ ఎన్ని ప్రలోభాలు గురి చేసినా తాము పార్టీ మారబోమని, రంగయ్యపై నమ్మకంతోనే తిరిగి పార్టీలోకి వచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మున్సిపల్ వైస్ చైర్మెన్ జయం ఫణి, కో ఆప్షన్ అఫ్జల్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

## సంక్షేమ ప్రభుత్వాన్ని కొనసాగించండి

రాయదుర్గం(డి హీరేహాళ్): వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి శనివారం డీ హీరేహాళ్ మండలం లింగమనహళ్లి, మడేనహళ్లి, లక్ష్మీపురం, జాజరకల్లు, హిర్దేహాళ్‌లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం. వన్నూరుస్వామి, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బోజరాజ్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు రవీంద్రనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు సాములాపురం సుదర్శనరెడ్డి, మురడి పద్మనాభరెడ్డి, మురళీమోహన్‌రెడ్డితో కలసి ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు.ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మెట్టు గోవిందరెడ్డి, శంకరనారాయణను గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ 126 సార్లు బటన్ నొక్కి లక్షల కోట్లు నేరుగా అక్క, చెల్లెమ్మల ఖాతాలకు చేర్చారన్నారు. ఈ ఎన్నికల్లో రెండు బటన్లు నొక్కి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి రుణం తీర్చుకోవాలన్నారు. సర్పంచులు శ్రీనివాసరెడ్డి, గంగమ్మ, మల్లికార్జున, కాదలూరు హనుమంతరెడ్డి, పరమేశ్, నాగరాజు, రుద్రేష్, మల్లికార్జున, ఎంపీటీసీ ముక్కన్న, కల్యం సురేష్, బీసీసెల్ మండల అధ్యక్షుడు పులకుర్తి చంద్ర, నాయకులు తొండె వెంకటేశులు, అంజిరెడ్డి, సందీప్‌పాటిల్, సురేష్‌యాదవ్, సింగాడి మంజు, హిర్దేహాళ్ మంజు, జయరాం, ఎర్రిస్వామి, రమేష్, వెంకటేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


ఓటు అభ్యర్థిస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

### రైలు కిందపడి మహిళ మృతి

రాయదుర్గం(డి హీరేహాళ్): డి హీరేహాళ్ మండలం పాతహడగలి సమీపాన శనివారం గుర్తు తెలియని మహిళ రైలు కింద పడి మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. రైలు బళ్లారి నుంచి రాయదుర్గం వైపు వస్తుండగా ఆమె పట్టాలపైకి రావడంతో ఈ ఘటన జరిగినట్లు తెలిసిందన్నారు. అయితే ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందిందా..? ఆత్మహత్య చేసుకుందా..? ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియరాలేదన్నారు. ఈ కేసును రైల్వే పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని వివరించారు.

### స్వేచ్ఛగా ఓటు వేయండి


కొంతానపల్లిలో కవాతు

రాయదుర్గం రూరల్: ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అర్బన్ సీఐ శ్రీనివాసులు ప్రజలకు సూచించారు. పట్టణంలోని భగత్‌సింగ్ నగర్ తోపాటు మండలంలోని కొంతానపల్లి గ్రామంలో శనివారం కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు. ఎస్ఐ రమణ, బీఎస్ఎఫ్ అధికారి మనోజ్ కుమార్ , సిబ్బంది పాల్గొన్నారు.

### టిప్పర్ ఢీకొని మహిళ మృతి


మృతురాలు సునీత

ఉరవకొండ: ఉరవకొండ పట్టణంలోని కవితా హోటల్ సర్కిల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విడపనకల్లు మండలం కరకముక్కల గ్రామానికి చెందిన సునీత అనే మహిళ మృతి చెందింది. ఆమె అదే గ్రామానికి చెందిన వ్యక్తితో కలిసి బైక్‌పై గవిమఠం వద్ద నుంచి వస్తుండగా గుంతకల్లు వైపు నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొంది. తీవ్రగాయాలపాలైన ఆమెను తొలుత స్థానిక ఆస్పత్రికి, తర్వాత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యంలో మృతి చెందింది. ఈఘటనలో మరో వ్యక్తి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

## నివాళులర్పించిన మెట్టుగోవిందరెడ్డి

గుమ్మఘట్ట: మండలంలోని కలుగోడు గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండిగానిపల్లి హనుమంతరెడ్డి తండ్రి రంగారెడ్డి(86) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి రంగారెడ్డి భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుమ్మఘట్ట, రాయదుర్గం జెడ్పీటీసీ సభ్యులు మహేష్, మల్లి కార్జున, బేలోడు సర్పంచ్ ఉమేష్‌రెడ్డి, జెడ్పీ మాజీ సభ్యుడు వన్నప్ప, నాయకులు ఆర్టీ లక్ష్మీకాంతారెడ్డి, గోనబావి ప్రతాప్‌రెడ్డి, నాగేంద్రప్ప, రాజయ్య, కరిడిపల్లి లక్ష్మీకాంతారెడ్డి, బేలోడు రామాంజినేయులు, బానేటి రామాంజినేయులు, మల్లికార్జున పాల్గొన్నారు. అలాగే సిరిగెదొడ్డి గ్రామంలో వరలక్ష్మి అనే మహిళ క్యాన్సర్‌తో మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి ఆ గ్రామానికి వెళ్లి నివాళులర్పించారు. మండల కన్వీనర్ గౌనిలక్ష్మీ కాంతారెడ్డి, మాజీ సర్పంచ్‌లు గాదిర పాలయ్య, విజయేంద్ర పాల్గొన్నారు.


రంగారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

## జగనన్నను మళ్లీ సీఎంను చేయడమే లక్ష్యం

- ఉద్యోగాలకు స్వచ్ఛందంగా రాజీనామా

విడపనకల్లు: హావళిగి గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మల్లికార్జున తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని ఈనెల 28న పంచాయతీ కార్యదర్శికి అందజేసినట్లు మల్లికార్జున శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. సీఎం జగనన్న తరఫున ప్రచారం చేసేందుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా ఉండటంతో ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు తెలిపారు. ఉరవకొండ అసెంబ్లీ, అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.

**వలంటీర్ రాజీనామా:**

జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలనే ఉద్దేశంతో హావళిగి గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన కొల్లాపిరి అనే గ్రామ వలంటీర్ రాజీనామా చేశారు. సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు చెప్పడానికి కూడా వీలు లేకుండా వలం టర్లపై టీడీపీ నాయకులు లేనిపోని నిందలు వేసి ఈసీకి ఫిర్యాదు చేస్తున్న తీరును చూసి ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు.


రాజీనామా లేక అందిస్తున్న ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మల్లికార్జున

### ఆరోపణలు అవాస్తవం


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంబదూరు: మండల కేంద్రంలోని సర్వేనం.245లోని జగనన్న లే అవుట్‌లో 84 ప్లాట్లను అధికార పార్టీ నాయకులు ఆక్రమించినట్లు వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ నారాయణస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేవలం తమపై బురద జల్లేందుకే టీడీపీ నాయకులు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆక్రమణకు గురైన స్థలాలను రెవెన్యూ, పోలీసులు చదును చేసి అర్హులైన నిరుపేదలకు పంచొచ్చని సూచించారు. అర్హత కలిగిన పేదలకు పంచితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు నీలిశంకరప్ప, ఎంపీటీసీ మీ సేవ కుమార్, ఆలయ ధర్మకర్త మల్లూరి వెంకటేశులు, నాయకులు కిరణ్, బాబు, చంద్ర, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

### శానిటరీ మేస్త్రీకి సన్మానం


గోవిందురాజు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలకసంఘంలోని పారిశుద్ధ్య విభాగంలో మేస్త్రీగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పి.గోవిందరాజులకు శనివారం వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ కిశోర్, డీఈ సురేష్ ఉద్యోగులు ఆయన్ను ఘనంగా సత్కరించి 39 సంవత్సరాలుగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. కిశోర్, ఈశ్వర్, జగదీష్, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

### నచ్చిన కోర్సుల్లో చేరండి

కళ్యాణదుర్గం: టెన్త్ తర్వాత విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు రాజగోపాల్ అన్నారు. పదో తరగతి అనంతరం ఏయే కోర్సులు చదవాలన్న అంశంపై సెంట్రల్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నచ్చిన కోర్సులను ఎంచుకుని లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. ఇంటర్, వృత్తి విద్యా కోర్సులపై వివరించారు శెట్టూరు ఎంఈఓ శ్రీధర్, రాజన్న పాల్గొన్నారు.

## అక్రమ మద్యం ధ్వంసం

రాయదుర్గం రూరల్: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తూ 24 కేసుల్లో పట్టుబడిన రూ.2.74 లక్షల విలువ చేసే 603 లీటర్ల మద్యాన్ని శనివారం ధ్వంసం చేసినట్లు అర్బన్ ఎస్ఐ రమణ తెలిపారు. పట్టణంలోని మోటారు వాహనాల అధికారి కార్యాలయం సమీపంలో సెబ్ ఏఈఎస్ మంగు శ్రీరాం ఆధ్వర్యంలో అక్రమ మద్యం ధ్వంసం చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే సెబ్ అధికారుల 19 కేసుల్లో పట్టుబడిన రూ.50 వేల విలువ చేసే 70 లీటర్ల మద్యంను కూడా ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ మురళీమోహన్ తెలిపారు.

**624 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం**

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం మండల పరిధిలోని మల్లిపల్లి, నారాయణపురం గ్రామాల సమీపంలో శనివారం సాయంత్రం సెబ్ పోలీసులు దాడులు చేశారు. బైక్‌పై రవాణా చేస్తున్న మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. మారెంపల్లి కాలనీకి చెందిన ఫక్కీరప్పను మల్లిపల్లి వద్ద అదుపులోకి తీసుకుని 480 కర్ణాటక టెట్రా హైవార్డ్స్ ప్యాకెట్లు, నారాయణపురం గ్రామ క్రాస్ వద్ద కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన బోయ హనుమంతప్పను అదుపులోకి తీసుకుని 144 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ వెంకట్ తెలిపారు. అక్రమంగా మద్యం సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.


అక్రమ మద్యాన్ని ధ్వంసం చేస్తున్న అధికారులు

## సంక్షిప్త సమాచారం

**కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం**

ఉరవకొండ: పట్టణంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏప్రిల్ 11లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**4న విగ్రహాల ప్రతిష్ఠాపన**

కూడేరు: ఇప్పేరులో శంభు లింగేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 4న గణపతి, సుబ్రహ్మణ్య స్వామి, గౌరీదేవి, నవగ్రహ విగ్రహాలు, బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు, నిర్వాహకులు తెలిపారు.

**రేషన్ డీలర్ సస్పెన్షన్**

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియామవళి ఉల్లంఘించిన వారిపై కలెక్టర్ గౌతమి చర్యలు తీసుకున్నారు. వజ్రకరూరు మండలం గడేహోతూరు గ్రామానికి చెందిన చౌక దుకాణపు డీలర్ ఎస్.నాగరాజును శనివారం సస్పెండ్ చేశారు. ఇప్పటి వరకూ 40 మంది వలంటీర్లు, ఏడుగురు డీలర్లు, ఒక ఎండీయూ ఆపరేటర్, 11 మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఒక పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్‌కు గురయ్యారు.

**ఉపాధి కూలీలకు దిన కూలి పెంపు**

కూడేరు: ఉపాధి హామీ పథకం పనులకు వచ్చే కూలీలకు దిన కూలిని కేంద్ర ప్రభుత్వం రూ.300కు పెంచినట్లు ఏపీఓ తులసీ ప్రసాద్ శనివారం వెల్లడించారు. ఇప్పటివరకు దిన కూలి రూ.272 ఉండేదన్నారు. ఏప్రిల్ 1 నుంచి పెంచిన దిన కూలి వర్తింపస్తుందన్నారు. నిబంధనల మేరకు పనులను నాణ్యతగా చేపడితే రూ.300 వర్తింపజేస్తామన్నారు.

**ఇఫ్తార్‌తో ఎంతో పుణ్యం**


జామియా మర్కజ్ మసీదు వద్ద జరిగిన ఇఫ్తార్ విందుకు హాజరైన ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పలు మసీదుల్లో శనివారం సాయంత్రం మగ్‌రిబ్ నమాజ్ అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. జామియా మర్కజ్ మసీదు, మక్కా మసీదు, టిప్పు మసీదు, బిలాల్ మసీదు, అహ్లెహదీస్ మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లింలు ఉపవాస దీక్ష విరమించి ఇఫ్తార్‌కు హాజరయ్యారు. ఉపవాస దీక్షాపరులకు ఇఫ్తార్ విందు ఇవ్వడం ఎంతో పుణ్యఫలమని ప్రభుత్వ ఖాజీ సైపుల్లా, మౌలానా ఏజాజ్ అహ్మద్ పేర్కొన్నారు.

**యువకుడు ఆత్మహత్యాయత్నం**

కళ్యాణదుర్గం: పట్టణంలోని వడ్డే కాలనీకి చెందిన వడ్డే రవి మద్యం మత్తులో గన్నేరు ఆకుల రసం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన శనివారం చోటు చేసుకుంది. అపస్మారక స్థితిలో పడివున్న రవిని కుటుంబ సభ్యులు కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తర్వాత అనంతపురం తరలించారు. అయితే రవి ఇటీవల ప్రైవేట్ ఫైనాన్స్‌లో బైకు తీసుకున్నాడని, కంతులు చెల్లించలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## కోడ్ ఉల్లంఘించకుండా పింఛన్ల పంపిణీ

కణేకల్లు: ఎన్నికల నియమావళికి అనుగుణంగా సామాజిక భద్రత పింఛన్లను పంపిణీ చేయాలని ఎంపీడీఓ గూడెన్న పేర్కొన్నారు. సచివాలయ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో శనివారం ఆయన తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వలంటీర్లు రాజకీయనాయకులను వెంటబెట్టుకొని పింఛన్లు పంపిణీ చేయడం, ఫొటోలు దిగడం చేస్తే చర్యలు తప్పవన్నారు. పింఛన్ల డబ్బు కన్నా ఎక్కువ మొత్తం వలంటీర్లతో ఉండరాదన్నారు.

గుమ్మఘట్ట: ప్రజలకు ప్రతినెలా అందిస్తున్న నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో స్టోర్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వీఆర్వోలతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికలపై అవగాహన కల్పించారు. ప్రతి లబ్ధిదారుడికి నిత్యావసర సరుకులు అందించాలన్నారు.

శెట్టూరు: ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు నిబంధనలు పక్కాగా అమలు చేయాలన్నారు. కోడ్ అమలులో నిష్పక్షపాతంగా ఉండాలన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈఓఆర్డీ రఘురామరావు పాల్గొన్నారు.